సాక్షి
పార్వతీపురం మన్యం
సోమవారం । 6 । అక్టోబర్ । 2025



సిరిమానోత్సవానికి రూట్‌మ్యాప్

పైడతల్లి సిరిమానోత్సవానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం వాహనాలను నిర్దేశించిన ప్రాంతాల్లో పార్కింగ్ చేయాలని ఎస్పీ దామోదర్ స్పష్టం చేశారు. - 8లో



కాకరకాయలతో రాక్షస బల్లి

పుష్ప ప్రదర్శన

విజయనగరం ఫోర్ట్: విజయనగరం ఉత్సవాల్లో భాగంగా స్థానిక మాన్సాస్ మైదానంలో ఆది వారం ఏర్పాటు చేసిన పుష్ప ప్రదర్శనను కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ప్రారంభించారు. ప్రదర్శనలో ఏర్పాటు చేసిన పుష్పాలను ఆసక్తిగా తిలకించారు. పలు రకాల పుష్పాలతో ఏర్పాటు చేసిన ప్రదర్శనలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకు న్నాయి.

ముఖ్యంగా పుష్పాలతో ఏర్పాటు చేసిన తంబుర, వయోలిన్, గంటస్తంభం, సీతాకోక చిలుక, కూరగాయలతో తయారు చేసిన మొసలి, డ్రాగన్, సైకత పైడితల్లి ఆకట్టుకున్నాయి. కార్యక్రమం లో జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి కె.చిట్టిబాబు, డీఆర్‌డీఏ పి.డి. శ్రీనివాసరావు, ఏపీడీ సావిత్రి, స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



పుష్ప ప్రదర్శనను ప్రారంభిస్తున్న కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డి



సైకత పైడితల్లి



పుష్ప ప్రదర్శన



వంకాయలతో ఏనుగు

న్యూస్‌రీల్

తగ్గుముఖం పట్టిన 'తోటపల్లి' ఉధృతి



తోటపల్లి ప్రాజెక్టు వద్ద పరిస్థితి

గరుగుబిల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం కారణంగా కురిసిన వర్షాలకు తోటపల్లి ప్రాజెక్టు వద్ద నాగావళి నీటి ప్రవాహం ఉధృతంగా వచ్చి క్రమేపి తగ్గుముఖం పడుతుంది. దీంతో నాగావళి నది పరివాహక ప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. నాగావళి నదిలో తోటపల్లి ప్రాజెక్టు వద్ద ఆదివారం సాయంత్రం నాటికి 105 మీటర్ల లెవెల్‌కుగాను 103.6 మీటర్ల లెవెల్‌లో నీరు నిల్వ వుంది. ప్రస్తుతం నది పైభాగం నుంచి ప్రాజెక్టుకు 5,769 క్యూసెక్కుల నీరు రాగా ఈ మేరకు అధికారులు రెండు గేట్లును ఎత్తివేసి 4,525వేల క్యూసెక్కుల నీటిని నదిలోకి విడిచి పెడుతున్నారు. అలాగే కాలువల ద్వారా 1,070 క్యూసెక్కుల నీటిని విడిచి పెడుతున్నారు. ప్రాజెక్టు నీటి సామర్థ్యం 2.53 టీఎంసీలకు గాను 1.692 టీఎంసీల నీటి సామర్థ్యం వున్నట్టు అధికారులు పేర్కొంటున్నారు. ప్రాజెక్టు వద్ద నీటి పరిస్థితిని ఇంజినీరింగ్ ఏఈ కిషోర్ పర్యవేక్షిస్తున్నారు.

వైభవంగా స్వామివారికి శ్రీచక్ర స్నానం



స్వామివారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు సందర్భంగా ఆదివారం స్వామివారికి శ్రీచక్ర స్నానాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి ఉదయం సుప్రభాతసేవ, చూర్ణోత్సవం, స్వపనం, మంగళాశాసనం, శాత్తుమురై తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులను ఆశీనులు చేయించి మంగళ వాయిద్యాలతో జలాభిషేకం, పాలాభిషేకం, పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలను, విశేష అర్చనలను నిర్వహించి స్వామివారికి శ్రీ చక్ర స్నానాన్ని అర్చకులు వీవీ అప్పలాచార్యులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం పవిత్ర నాగావళి నదిలో భక్తులు పుణ్య స్నానాలను ఆచరించారు. స్వామివారి శ్రీచక్ర స్నానం వేడుకలలో పాల్గొనేందుకు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సిబ్బంది చర్యలు చేపట్టారు.

ఖాజీపురంలో గజరాజులు



ఖాజీపురం సమీపంలో ఏనుగుల గుంపు

భామిని: మండలంలోని గజపతినగరం సమీపంలో ఖాజీపురానికి గజరాజుల గుంపు ఆదివారం చేరుకుంది. ఏబీ రోడ్డు సమీపంలో ఉన్న గిరిజన కాలనీ ఖాజీపురానికి నాలుగు ఏనుగులు చేరడంతో స్థానికుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ఇప్పటికే గిరిజనులు పండించే పంటలను ఏనుగులు తినివేయడంతో పాటు ధ్వంసం చేస్తుండడంతో తీవ్ర నష్టం తప్పదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విజయనగర వైభవం ఉట్టిపడేలా..

- ప్రారంభమైన విజయనగరం ఉత్సవాలు
- 11 వేదికల్లో ఆకట్టుకున్న కార్యక్రమాలు
- ఉత్సవ ర్యాలీని ప్రారంభించిన మంత్రులు అనిత, శ్రీనివాస్
- సోమవారంతో ముగియనున్న ఉత్సవాలు



కోటలో చిన్నారుల నృత్య రూపకం

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

జానపద కళలతో కనువిందు చేస్తూ, కళా రూపాలతో మైమరిపింపజేస్తూ, విచిత్ర వేషధారణలతో ఆకట్టుకుంటూ విజయనగర ఉత్సవ శోభాయాత్ర శోభాయమానంగా జరిగింది. విజయనగర ఉత్సవాల ప్రారంభానికి సంకేతంగా పైడితల్లి అమ్మవారి ఆలయం వద్ద ఆదివారం ఉదయం మంత్రులు వంగలపూడి అనిత, కొండపల్లి శ్రీనివాస్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం కోట వద్ద ప్రముఖులు ఆసీనులై కళా రూపాలను తిలకించారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వంగలపూడి అనిత, విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అతిథి గజపతిరాజు కళాకారులతో కలిసి థింసా నృత్యం చేశారు.

శోభాయమానంగా శోభాయాత్ర

ర్యాలీలో స్వాగత శకటం, రోలర్ స్కేటర్స్ విన్యాసాలతో, పైడితల్లి అమ్మవారి కలశాలతో మహిళలు, తప్పెటగుళ్లు, థింసా నృత్యం, పులి వేషాలు, విచిత్ర వేషాలు, ఆగమ పండితుల బృందం, విజయనగరం వైభవం, కేరళ వాయిద్యాలు, కర్ర సాము, అడుగుల బొమ్మలు, కొమ్ము కోయ డ్యాన్స్, బిందెల డ్యాన్స్, చెక్క భజన, గంగిరెద్దులు, జముకుల బృందం, కాళీమాత డ్యాన్స్, ఎన్సీసీ కేడేట్స్ మార్చ్, కోలాటం, క్రీడా సంఘాలు మరియు క్రీడాకారులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఎస్.ఆర్.ఇ.జి.ఎస్, ఎస్.హెచ్.జి.గ్రూపులు తదితర బృందాలు అలరించాయి.

సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుకోవాలి

ఈ సందర్భంగా విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకొనేందుకు ఇటువంటి పండుగలు దోహదం చేస్తాయనున్నారు. నేటి తరానికి సంప్రదాయాలు, కళలను అందించాల్సిన అవసరం ఉందన్నారు. జానపద కళలను, కళాకారులను ఆదుకునేందుకు ఇటువంటి ప్రదర్శనలు ఎంతో అవసరమని అన్నారు. పైడితల్లి అమ్మవారు జిల్లా ప్రజలందరినీ చల్లగా చూడాలని ఆకాంక్షించారు.

11 వేదికల్లో ఆకట్టుకున్న వివిద కార్యక్రమాలు

జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో విజయనగరం ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు నిర్వహించ తలపెట్టిన ఉత్సవాల్లో భాగంగా 11 వేదికల్లో వివిధ రకాల కార్యక్రమాలను జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా ఆదివారం అతిథులు చేతుల మీదుగా ప్రారంభించారు. ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకోగా... మాన్సాస్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఫల, పుష్ప ప్రదర్శనలు చూపరులకు కనువిందు చేశాయి. బొంకుల దిబ్బపై పౌరాణిక నాటకాలు ప్రదర్శించగా, గురజాడ కళా క్షేత్రంలో స్థానిక కళాకారులు ప్రదర్శించిన నాటకాలు అలరించాయి. లయన్స్ కమ్యూనిటీ హాల్‌లో జానపద కళా రూపాలు ప్రదర్శన విజయనగరం సంస్కృతిని ప్రతిబింబించగా.. అయోధ్య మైదానంలో నిర్వహించిన పెట్ షో అందరినీ ఆకట్టుకుంది. రెండవ రోజైన సోమవారం ఈ కార్యక్రమాలను కొనసాగిస్తూ అయోధ్య మైదానంలో ప్రముఖ సింగర్స్‌తో మ్యూజికల్ నైట్ ఏర్పాటు చేయనున్నారు.

కార్యక్రమంలో కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డి, ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగారురాజు, డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున, జేసీ ఎస్.సేతుమాధవన్ తదితర ప్రముఖులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



విజయనగరం ఉత్సవ శోభాయాత్రను ప్రారంభిస్తున్న నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు



శోభాయాత్రలో తప్పెటగుళ్ల ప్రదర్శన



శోభాయాత్రలో కాళికాదేవి అవతారంలో కళాకారులు

ఎవరూ ఆందోళన చెందవద్దు

- పరిస్థితి అదుపులో ఉంది
- గిరిజన సంక్షేమ గురుకుల కార్యదర్శి గౌతమి

పార్వతీపురం టౌన్: కురుపాం గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో పచ్చకామెర్ల లక్షణాలతో బాధపడుతున్న విద్యార్థినుల ఆరోగ్యం నిలకడగా ఉందని గిరిజన సంక్షేమ శాఖ గురుకుల కార్యదర్శి ఎం.గౌతమి అన్నారు. విద్యార్థినుల మృతి చాలా బాధాకరమని ఆమె విచారం వ్యక్తం చేశారు. ఆదివారం పార్వతీపురం జిల్లా ఆసుపత్రిని ఆమె సందర్శించారు. ఆసుపత్రిలో విద్యార్థినులకు అందిస్తున్న వైద్య సేవలను ఆమె పరిశీలించి, విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌కి సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంఘటన జరిగిన వెంటనే జిల్లా యంత్రాంగం సమన్వయంతో సత్వర చర్యలు చేపట్టడంతో మిగిలిన సుమారు 600 వందల మంది విద్యార్థినులకు ఎటువంటి అనారోగ్య సమస్యలు రాకుండా ముందస్తు వైద్య సేవలు అందించడం జరిగిందన్నారు. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా గడచిన నాలుగైదు రోజుల్లో సుమారు 120 మంది విద్యార్థినులకు ఆరోగ్య సమస్యలు వచ్చాయని, వారిని వెంటనే జిల్లా ఆసుపత్రి తీసుకువచ్చి వైద్య సేవలు అందిస్తున్నామని వివరించారు. ఎవరైతే పచ్చకామెర్లు, ఇతరత్రా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారో వారిని విశాఖపట్నంలోని కేజీహెచ్ ఆసుపత్రికి తరలించి వైద్య సేవలను అందిస్తూ, నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఎవరు ఎటువంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. జరిగిన సంఘటనలపై ప్రత్యేక బృందాన్ని నియమించామని, వారు సమగ్ర విచారణ జరిపి నివేదికలు సమర్పిస్తే తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. పాఠశాలలో కొత్త ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేస్తామని, పూర్తి జాగ్రత్తలు తీసుకుంటామని ఆమె వెల్లడించారు. విద్యార్థినులందరికీ అదనంగా పౌష్టికాహారం అందించడానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సికిల్‌సెల్, అనీమియా కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని అన్నారు. ఆమె వెంట జాయింట్ కలెక్టర్ యశ్వంత్ కుమార్‌రెడ్డి, పార్వతీపురం సబ్ కలెక్టర్ డా. ఆర్.వైశాలి, వైద్య ఆరోగ్య శాఖ సూపరింటెండెంట్ నాగ శివజ్యోతి, ఆసుపత్రి సిబ్బంది తదితరులు ఉన్నారు.

పార్వతీపురం రూరల్: కురుపాం గురుకుల పాఠశాలలో హెపటైటిస్ వ్యాధి 120 మంది విద్యార్థుల్లో ప్రబలడంతో పాఠశాలలో వ్యాధి ప్రబలడానికి గల కారణాలను దర్యాప్తు ద్వారా తెలుసుకునేందుకు, పాఠశాలలో సమగ్ర పారిశుధ్య చర్యలు, నీటి క్లోరినేషన్ వంటి పనులు చేపట్టేందుకు, రాపిడ్ రెస్పాన్స్ టీం తుది నివేదిక వస్తున్న నేపథ్యంలో అక్టోబర్ 6 నుంచి 12వ తేదీ వరకు ఏడు రోజుల పాటు పాఠశాలకు సెలవులు ప్రకటించినట్టు కలెక్టర్ డా. ఎన్.ప్రభాకరరెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉందని, ఎలాంటి ఆందోళన చెందనవసరం లేదని తెలిపారు.

తొలి ఏరుకు వేళాయె..

- నేడు పైడితల్లి అమ్మవారి తొలేళ్ల ఉత్సవం
- సిరిమానోత్సవం రేపు
- పట్టువస్త్రాలను సమర్పించనున్న రాజవంశీకులు



ప్రత్యేక అలంకరణలో పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: శ్రీ పైడితల్లి అమ్మవారి తొలేళ్ల సంబరానికి సర్వం సిద్ధమైంది. అమ్మవారి అనుగ్రహంతో వచ్చిన విత్తనాలను వేసి నాగలి (ఏరు)తో తొలుత దున్నాలి. దానినే తొలి ఏరు అని... తొలేళ్లని పిలుస్తారు. అమ్మవారి సిరిమానోత్సవానికి ముందు రోజు దీన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తారు. పంటకు ఎలాంటి విపత్తులూ, చీడపీడల బాధలు, దరి చేరకూడదనేది రైతు కోరిక. వారి కోసం నిర్వహించేదే తొలేళ్ల ఉత్సవం. తొలేళ్ల రోజు రాత్రి చదురుగుడి నుంచి అమ్మవారి ఘటాలను కోటలోకి తీసుకువెళతారు. అక్కడ కోటశక్తికి పూజలు చేసి, అమ్మవారి ఆశీర్వచనం పొందిన విత్తనాలను బస్తాలతో ఉంచుతారు. సిరిమాను పూజారి చేతులతో ఆ విత్తనాలను అందించి అమ్మవారు ఆశీర్వదిస్తారు. ఆ విత్తనాలను రైతులు తమ బస్తాలలో కలిపి పొలాల్లో చల్లుతారు. మంచి దిగుబడులు సాధిస్తారు.

ఊరంతా పండగ శోభ


విజయాలకు ప్రతీకగా నిలిచిన విద్యల నగరమైన విజయనగరి అమ్మవారి తొలేళ్ల సంబరాలు ఈ ఏడాది అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. సోమవారం ఉదయం నుంచి మరుసటి రోజు మంగళవారం మధ్యాహ్నం వరకూ అమ్మవారి దర్శన భాగ్యం భక్తులకు కలిగించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు మూడువేల మంది పోలీసు బలగాలను ఉత్సవ విధులకు కేటాయిస్తున్నామని పోలీస్ ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. ఇటు రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడి, మూడులాంతర్లు వద్దనున్న చదురుగుడి ప్రాంతమంతా విద్యుత్ శోభతో అలరారుతోంది. మరోవైపు విజయనగర ఉత్సవాల సందడితో చారిత్రాత్మక కట్టడాలన్నీ విద్యుత్ అలంకరణలతో శోభాయామానంగా తయారైంది. మహారాజ కోట, గంటస్తంభం, మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల, మయూరీ కూడలి నుంచి రైల్వే స్టేషన్ మీదుగా సీఎంఆర్ జంక్షన్ వరకూ విద్యుత్ లైట్లు ఆకట్టుకుంటున్నాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు అమ్మవారికి ఘటాలు సమర్పించడంతో పాటూ పసుపు, కుంకుమలతో మొక్కులు చెల్లించుకుంటున్నారు. అమ్మవారు ఆలయమంతా పుష్పశోభితంగా విరాజిల్లుతోంది. తల్లి జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు జిల్లా ప్రజలు, అధికారులు సన్నద్ధమయ్యారు.

తొలేళ్ల రోజు ప్రధాన ఘట్టాలివే...

- వేకువజామున 3 గంటల నుంచి అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తారు.
- ఉదయం రాజవంశీకులు, మంత్రులు అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పిస్తారు.
- రాత్రి 10.30 గంటలకు భాజాభజంత్రీలతో అమ్మవారి ఘటాలకు పూజలు చేసేందుకు కోటలోకి పూజారులు వెళ్తారు. కోటశక్తికి, అమ్మవారి ఘటాలకు పూజాధికాలు నిర్వహిస్తారు.
- ఘటాలను తిరిగి చదురుగుడి వద్దకు తీసుకువచ్చి గుడి ఎదురుగా ఉన్న బడ్డీలా ఏర్పాటు చేసిన వాటిపై భక్తుల సౌకర్యార్థం ఉంచుతారు. అమ్మవారి దర్శనానికి అవకాశం లేని వారందరూ అక్కడే పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లిస్తారు.
- ఘటాలను తీసుకువచ్చిన తర్వాత పూజారి అమ్మవారి చరిత్ర చెప్పి రైతులకు ధాన్యాన్ని పంచుతారు. రైతులు ఆ విత్తనాల కోసం బారులు తీరుతారు.

తోటపల్లి ఆధునికీకరణ పనులకు మోక్షం కలిగేనా..!

- అసెంబ్లీ సమావేశాల్లో తోటపల్లి ఊసెత్తని ప్రభుత్వం
- మరో రెండు నెలల్లో ముగియనున్న ఖరీఫ్ సీజన్
- ఈ ఏడాది వరుణిడి కరుణతో గట్టెక్కిన ఖరీఫ్
- ఏడాది కిందట తోటపల్లి ఆధునికీకరణ పనులను రద్దు చేసిన కూటమి ప్రభుత్వం
- తోటపల్లి పాత ఆయకట్టు పరిధి సుమారు 64 వేల ఎకరాలు



తోటపల్లి జలాశయం

వీరఘట్టం: ఈ ఏడాది ఖరీఫ్‌కు జూలై 16న తోటపల్లి పాత ఆయకట్టులోని కుడి, ఎడమ కాలువలకు జల వనరుల శాఖ అధికారులు సాగునీరు విడుదల చేశారు. నీరు విడిచిపెట్టి నెల రోజులు గడిచినా పాలకొండ శివారు ఆయకట్టుకు తోటపల్లి కాలువల ద్వారా నీరు అందకపోవడంతో ఆకు మడులు ఎండిపోతున్నాయని, తక్షణమే పాలకొండ శివారుకు నీరందెలా చేయాలని అన్నదాతలు రోడ్డెక్కారు. అన్నదాతలు ఎంత గగ్గోలు పెట్టినా ఎవరూ పట్టించుకోలేదు. చివరకు వరుణదేవుని కరుణతో వర్షాలు పుష్కలంగా కురవడంతో పాలకొండ శివారు ఆయకట్టు రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఇదే విషయాన్ని ఇటీవల జరిగిన వీరఘట్టం మండల సర్వసభ్య సమావేశంలో జల వనరుల శాఖ ఏఈ డి.వి. రమణ స్పష్టం చేశారు. వర్షాలు సకాలంలో కురవడంతో ఖరీఫ్ గెట్టెక్కిందన్నారు. మరో రెండు నెలల్లో ఖరీఫ్ సీజన్ ముగియనుంది. ఈ ఏడాది డిసెంబర్ నుంచి కాలువ పనులు చేసేందుకు వాతావరణం అనుకూలంగా ఉంటుంది. అయితే ఎంతో ప్రాధాన్యత ఉన్న తోటపల్లి పాత ఆయకట్టు ఆధునికీకరణ అంశంపై కూటమి ప్రభుత్వం కనీసం స్పందించకపోవడంపై రైతన్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తోటపల్లి పేరుతో ఓట్లు దండుకున్నారు..


ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో కనీసం తోటపల్లి పాత ఆయకట్టు కాల్వల ఆధునికీరణ పనుల అంశాన్ని ప్రస్తావించ లేదు. దీంతో ఇక తోటపల్లి పాత ఆయకట్టు ఆధునికీకరణకు ఎప్పుడు మోక్షం కలుగుతుందా.. అని రైతులు ప్రశ్నిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల ముందు కూటమి నాయకులు తోటపల్లి పేరు చెప్పుకుని ఓట్లు దండుకొని ఇప్పుడు విస్మరించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వానికి తెలియజేశాం..

తోటపల్లి పాత ఆయకట్టు కాలువల ఆధునికీకరణ పనుల విషయాన్ని ప్రభుత్వానికి తెలియజేశాం. గతంలో జరిగిన ఈ పనులు 25 శాతం కంటే తక్కువ చేపట్టినందున ఈ పనులు ప్రభుత్వం నిలిపివేసింది. ప్రస్తుతం ఈ అంశం ప్రభుత్వ పరిధిలో ఉంది.

– వై.గన్నిరాజు, డీఈఈ, జల వనరుల శాఖ, పాలకొండ డివిజన్

రూ.300 కోట్లు అవసరం



ప్రస్తుతం తోటపల్లి పాత ఆయకట్టు ఆధునికీకరణ పనులు చేపట్టాలంటే రూ.300 కోట్లు ఖర్చవుతుందని అధికారులు తెలిపారు. ఈ మేరకు ఈ ఫైల్‌ను ప్రభుత్వానికి అందజేశాం. అయితే నిధుల కొరత ఉందని ప్రభుత్వం తెలిపింది. ప్రసుత్తం ఈ పనులు నిలిచిపోవడంతో రైతులు పడుతున్న ఇబ్బందులను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లాం. కనీసం పెద్దబుడ్డిడి వద్ద ఉన్న సైఫన్‌ను బాగు చేసేందుకైనా నిధులు విడుదల చేయాలని కోరాం.

– పొదిలాపు విజయరమణి, తోటపల్లి ప్రాజెక్టు కమిటీ చైర్మన్

రైతన్నలను మోసగించారు..



తోటపల్లి పాత ఆయకట్టును సస్యశ్యామలం చేస్తామని ఎన్నికల ముందు రైతాంగానికి కల్లబొల్లి మాటలు చెప్పిన కూటమి ప్రభుత్వం ఈ ప్రాంత రైతాంగాన్ని మోసగించింది. ఆపేసిన తోటపల్లి పాత ఆయకట్టు ఆధునికీకరణ పనులను వెంటనే ప్రారంభించాలి. లేదంటే రైతులతో కలసి వైఎస్సార్‌సీపీ పోరాడుతుంది.

– పొట్నూరు లక్ష్మణరావు, రైతు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు, తెట్టంగి, వీరఘట్టం మండలం

చిత్తశుద్ధి ఉంటే పనులు చేపట్టాలి



ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను కూటమి నాయకులకు చిత్తశుద్ధి ఉంటే నిలబెట్టుకోవాలి. తోటపల్లి పాత ఆయకట్టు కాలువ పనులు నిలిపివేయడం పద్ధతి కాదు. చంద్రబాబు ఈ ప్రాంత రైతులకు వెన్నుపోటు పొడిచారు.

– దమలపాటి వెంకటరమణనాయుడు, ఎంపీపీ, వీరఘట్టం

క్లుప్తంగా

ఏనుగు పిల్ల మృతి


మృతి చెందిన ఏనుగు పిల్ల

పార్వతీపురం రూరల్: మండలంలోని లక్ష్మీనా రాయణపురం గ్రామ ముదిరాజు చెరువులో ఆదివారం ఉదయం ఏనుగుల గుంపులో ఉన్న పిల్ల ఏనుగు మృతి చెందింది. ఇటీవల కొద్ది వారాల నుంచి పార్వతీపురం మండలంలోని తొమ్మిది ఏనుగుల గుంపు సంచరిస్తుంది. ఈ నేపథ్యంలో ఆదివారం ఏనుగుల గుంపులో ఉన్న పిల్ల ఏనుగును పెద్ద ఏనుగులు తొక్కడంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న స్థానిక అటవీ శాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని మరణానికి కారణాలను పరిశీలిస్తున్నారు. ఈ విషయమై ఎలిఫెంట్ మానిటరింగ్ అధికారి మణికంటేశ్వరరావు మాట్లాడుతూ ఏనుగు పిల్ల వయసు ఏడు నెలలని తెలిపారు. పోస్టుమార్టం నిమత్తం కొమరాడ మండలం అర్తాం తరలించామని చెప్పారు.

కారు ఢీ కొని లారీ డ్రైవర్‌కు తీవ్రగాయాలు


తీవ్రగాయాల పాలై ఘటనా స్థలంలో పడి ఉన్న వెంకటరావు

రామభద్రపురం: మండలంలోని ముచ్చర్లవలస సమీపంలో గల భారత్ పెట్రోల్ బంకు వద్ద జాతీయ రహదారిపై ఆదివారం కారు ఢీ కొనడంతో ఓ లారీ డ్రైవర్ తీవ్రగాయాల పాలయ్యాడు. ఈ ఘటనపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం పట్టణానికి చెందిన లారీ డ్రైవర్ గేదెల వెంకటరావు లారీతో విజయనగరం వెళ్తూ ముచ్చర్లవలస పెట్రోల్ బంకు వద్ద మూత్ర విజర్జన కోసం జాతీయ రహదారి పక్కన లారీ ఆపి రోడ్డు క్రాస్ చేస్తున్నాడు. ఆ సమయంలో రామభద్రపురం నుంచి విజయనగరం వెళ్తున్న కారు లారీ డ్రైవర్‌ను ఢీ కొట్టింది. దీంతో వెంకటరావు తీవ్ర గాయాలపాలై తుళ్లిపోవడంతో మృతిచెందాడేమోనని భావించి కారు డ్రైవర్ రోడ్డు కారు రోడ్డు పక్కన పెట్టేసి పరారయ్యాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని ప్రథమ చికిత్స నిమిత్తం క్షతగాత్రుడిని బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. ఎస్సై వి. ప్రసాదరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాన్‌బోల్తా పడి యువకుడి మృతి

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలంలోని తోండ్రంగి గ్రామంలో వ్యాన్ బోల్తా పడి గ్రామానికి చెందిన పెనుమజ్జి కుమార్ (25) మృతిచెందాడు. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల మేరకు..గ్రామంలో జరుగుతున్న నిర్మాణ పనుల్లో భాగంగా వ్యాన్‌లో ఐరన్ రాడ్లు తీసుకువచ్చారు. ఐరన్‌లోడుతో ఉన్న వ్యాన్‌ను ఎత్తు భాగానికి ఎక్కిస్తుండగా బోల్తాపడింది. దీంతో వ్యాన్ పక్కనే ఉన్న పెనుమజ్జి కుమార్ సంఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచాడు. తల్లిదండ్రులు ఆదిబాబు, చిట్టెమ్మ దంపతులకు కుమార్ పెద్ద కొడుకు కాగా సమీపంలో ఉన్న పవర్‌ప్లాంట్‌లో విధులు నిర్వహిస్తున్నాడు.

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹147	₹264	₹274


సమావేశంలో మాట్లాడుతున్న శాసన మండలి విపక్ష నేతబొత్స సత్యనారాయణ


జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు


మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్న దొర

వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం విశాఖ జిల్లా ఆనందపురంలోని ఓ కన్వెన్షన్ హాలులో ఆదివారం జరిగింది. వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో శాసన మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ, విజయనగరం జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ విజయనగరం జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాస రావు, మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి తదితర విజయనగరం జిల్లా వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. – విశాఖపట్నం


మూతపడిన జనరిక్ మందుల షాపు

- అధిక ధరకు మందుల కొనుగోలు
- ఇబ్బందులు పడుతున్న పేదరోగులు

విజయనగరం ఫోర్ట్: ఏజబ్బు అయినా సరే మందుల ద్వారానే నయమవుతుంది. అధికశాతం మంది ప్రజలు బీపీ, షుగర్, ఆస్తమా, కిడ్నీ, లివర్, గుండె, అర్థరైటిస్, కీళ్ల నొప్పులు ఇలా రకరకాల వ్యాధులతో బాధపడుతున్నవారు ప్రైవేట్ మందుల దుకాణాల్లో మందులు కొనుగోలు చేయాలంటే అధిక మొత్తంలో వెచ్చించాల్సిన పరిస్థితి. పేద, మధ్య తరగతి వర్గాలకు అది అదనపు భారమే. ఇటువంటి పరిస్థితుల్లో తక్కువ ధరకు మందులు లభించే జనరిక్ మందుల దుకాణం పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. అయితే అవసరమైతే జనరిక్ మందుల దుకాణాలను పెంచాల్సి ఉంది. కానీ ప్రభుత్వసర్వజన ఆస్పత్రి ఆవరణంలో ఉన్న జనరిక్ మందుల దుకాణం మూత పడి రోజులు గడుస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏళ్ల తరబడి నిర్వహిస్తున్న షాపు అకస్మాత్తుగా మూతపడినా అధికారులు నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఎక్కువ మంది రోగులు మందుల కొనుగోలు

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి నిత్యం ఓపీ విభాగానికి 1000 నుంచి 1200 మంది వస్తారు. వారికి ప్రభుత్వ ఆస్పత్రిలో మందులు ఉచితంగా ఇస్తారు. ఆస్పత్రిలో అందుబాటులో లేని మందులను రోగులు జనరిక్ మందుల దుకాణంలో కొనుగోలు చేసేవారు. అదేవిధంగా బీపీ, షుగర్, కేన్సర్ వంటి దీర్ఘకాలిక రోగులు కూడా ఇక్కడే మందులు కొనుగోలు చేసేవారు. ప్రైవేట్ మెడికల్ షాపుల కంటే అతి తక్కువ ధరకు మందులు లభించడంతో అధికశాతం మంది జనరిక్ మందులు దుకాణంలో కొనుగోలు చేయడానికి ప్రాధాన్యం ఇస్తారు.


ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఆవరణంలో మూత పడ్డ జనరిక్ మందుల దుకాణం

ఆదేశాల మేరకు చర్యలు

జనరిక్ దుకాణం నిర్వహించే వారికి ఆస్పత్రి నుంచి ఎటువంటి అనుమతులు లేవు, విద్యుత్ బిల్లులు కూడా ఆస్పత్రి నిధుల నుంచే కడుతున్నాం. అద్దె కూడా చెల్లించడం లేదు. దీనిపై డీఎంఈకు లెటర్ రాశాం. అక్కడి నుంచి వచ్చిన ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ అల్లు పద్మజ, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

20 రోజులవుతున్నా పట్టించుకునే వారే కరువు

జనరిక్ మందుల దుకాణం మూత పడి 20 రోజులు దాటుతున్నా ఇప్పటి వరకు అధికారులు పట్టించుకున్న దాఖలాలులేవు. దుకాణం నిర్వహించేవారు ఎందువల్ల తెరవడం లేదనే దానిపై అధికారులు ఆరా కూడా తీయలేదని తెలుస్తోంది.

అలరించిన పెట్ షో

విజయనగరంఫోర్ట్: విజయనగర ఉత్సవాల్లో భాగంగా స్థానిక అయోధ్య మైదానంలో ఆదివారం ఏర్పాటు చేసిన పెట్ షో అకట్టుకుంది. పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పెట్ షో నిర్వహించారు. సిజ్జు, జెర్మనీ పెషర్డ్, ల్యాబ్, కొమిరేనియా, డాబర్ మెన్ తదితర 20 రకాలకు చెందిన 195 పెట్స్ (పెంపుడు కుక్కలు) షోలో పాల్గొన్నాయి. పెట్‌షోలో పాల్గొనేందుకు 170 మంది ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోగా, 25 మంది స్పాట్‌లో రిజిస్టర్ చేసుకున్నారు. పెట్‌లో షోలో పుంగనూరు జాతి ఆవులు, విదేశీ పావురాలు, గినీపిక్స్, లవ్‌బర్డ్స్, రాబిట్స్ , పావురాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. షోలో పాల్గొన్న పెట్స్ యాజమానులకు జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ మురళీకృష్ణ సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ జి.మహాలక్ష్మి, అసిస్టెంట్ డైరెక్టర్స్ డాక్టర్ కేవీ.రమణ, డాక్టర్ టి. ధర్మారావు, డాక్టర్ ఎల్. విష్ణు, డాక్టర్ ఆర్.శారద, డాక్టర్ పి.అనూరాధ, వీఏఎస్‌ల డాక్టర్ టి.మోహన్ రావు, డాక్టర్ ఎస్.జి.సాగర్, డాక్టర్ వి. భావన, డాక్టర్ ఎ.భాగ్యరాజ్, డాక్టర్ ఎల్.శ్రుతి పాల్గొన్నారు.


షోలో పెట్స్‌ను ప్రదర్శిస్తున్న యాజమానులు

ఆర్చరీలో మెరిసిన అక్కాచెల్లెళ్లు

- రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్‌కు ఎంపిక


రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికైన అక్కాచెల్లెళ్లు

సీతంపేట: ఎస్‌జీఎఫ్ క్రీడల్లో ఆర్చరీ రాష్ట్రస్థాయి పోటీలకు స్థానిక హిమరక ప్రసాదరావు కుమార్తెలు ఎంపికయ్యారు. ఆదివారం శ్రీకాకుళంలో జరిగిన జిల్లా స్థాయి ఆర్చరీ పోటీల్లో సీతంపేట మండలం నుంచి అక్కాచెల్లెళ్లు హాజరు కాగా అండర్ 19లో హెచ్.సంయుక్త, అండర్ 17లో హెచ్.లక్షితలు ఎంపిక కావడం పట్ల ఐటీడీఏ ఏపీఓ చిన్నబాబు, ఐటీడీఏ స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జాకాబ్ దయానంద్, కోచ్ మధులతో పాటు పలువురు అభినందించారు.

ప్రారంభమైన క్రీడోత్సవం


చెస్ ఆడుతున్న క్రీడాకారులు

విజయనగరం: విజయనగర ఉత్సవాల్లో భాగంగా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో తలపెట్టిన క్రీడోత్సవం ఆదివారం సాయంత్రం ప్రారంభమైంది. ఉత్సవాల్లో భాగంగా మొత్తం ఏడు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనుండగా స్థానిక ఎమ్మెల్యే పూసపాటి అదితిగజపతిరాజు ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, పుట్‌బాల్ క్రీడాంశాల్లో ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన పురుష జట్లకు మాత్రమే పోటీలు నిర్వహించగా..టెన్నిస్ క్రీడాంశంలో ఉత్తరాంధ్ర స్థాయిలో పోటీలు నిర్వహించారు. చెస్ క్రీడాంశంలో 15 సంవత్సరాల లోపు వయస్సు గల బాల,బాలికలకు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 800 మంది క్రీడాకారులు పాల్గొనగా..ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో పోటీలు జరిగాయి. పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు సోమవారం సాయంత్రం బహుమతీ ప్రదానోత్సవం చేయనున్నట్లు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి కె.శ్రీధర్‌రరావు తెలిపారు. పోటీలను ఆయా క్రీడా అసోసియేషన్‌ల ప్రతినిధులు కె.జ్వాలాముఖి, కేవీఎస్ చిన్నారి, కేవీ.ప్రభావతి, వై.కుసుంబచ్చన్, నున్న సురేష్ తదితరులు పర్యవేక్షించారు.

అలరించిన థింసా నృత్య ప్రదర్శన


నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

విజయనగరం టౌన్: విజయనగరం ఉత్సవాల్లో భాగంగా స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాల్‌లో పలువురు చిన్నారులు ఆదివారం చేసిన థింసా నృత్య ప్రదర్శన చూపరులను అలరించింది. అలాగే బాలభవన్, నెల్లిమర్ల, చీపురుపల్లి, రాజాం కళాకారుల బృందాలు చేసిన జానపద కళా ప్రదర్శనలు సైతం ఆకట్టుకున్నాయి.

సంగీత సాహిత్య సమలంకృతే..!

- సంగీత సరస్వతికి స్వర నీరాజనం
- 32 రకాల సంగీత బృందాలు, 315 కళాకారులతో స్వరాభిషేకం
- ఆహూతుల మన్ననలు పొందిన సంగీత, నృత్యప్రదర్శనలు
- విజయనగర ఉత్సవ వేదికలో మిన్నంటిన స్వరఝరి


టి.తన్మయి బృందం చిన్నారుల నృత్య ప్రదర్శన

విజయనగరం టౌన్: సంగీత సరస్వతికి స్వర నీరాజనం పలికారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమైన విజయనగరం ఉత్సవాల్లో సంగీత కళాకారులు కళామతల్లిని స్తుతిస్తూ చేసిన స్వరాభిషేకం ఆద్యంతం రక్తికట్టించింది. విజయనగర ఉత్సవాల్లో భాగంగా స్థానిక మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్యకళాశాలలో ఘంటసాల, ద్వారం వంటి ఎందరో మహనీయులు సాధన చేసిన కచేరీ మందిరంలో 32 బృందాలు, 315 మంది కళాకారులు తమ స్వరఝరిని వినిపించి, కళ్లకు కట్టినట్లు చూపించి చూపరులను కట్టిపడేశారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు ఇవే..

కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మండపాక నాగలక్ష్మి నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమాలను జ్యోతిప్రజ్వలన, ప్రార్థనాగీతాలాపన, స్వాగత నృత్యాంజలితో ప్రారంభించారు. ఎస్.గోపాలరావు బృందం నాదస్వరం, శ్రీహరి సంకీర్తన ఝరి ఎస్.వెంకటరావు బృందం గాత్రం, ఎస్.కాశీప్రసాద్ బృందం గాత్రం, కె.ఎ.పద్మప్రియ బృందం వీణకచేరీ, నర్తనశాల డ్యాన్స్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ భేరిరాధికారాణి బృందం నృత్యప్రదర్శన, అమృత వర్షిణి స్కూల్ ఆఫ్ డ్యాన్స్ టి.సౌమ్య బృందం నృత్యప్రదర్శన ఆద్యంతం అలరించాయి. టి.తన్మయి బృందం నృత్యప్రదర్శన, టి.అమ్మాజమ్మ గాత్రకచేరీ చూపరులను కట్టిపడేశాయి. సీహెచ్.శైలజ గాత్రం, ఎస్‌వీ.కామేశ్వరరావు ఫ్లూట్ ఆధ్యాత్మికతను సంతరించుకున్నాయి. ఎస్‌వీఎస్.వివేక్, శరత్ బృందం మైమ్, అభినయ డ్యాన్స్ స్కూల్ ఎం.సాయి ప్రియబృందం, ఇబ్రహీం ఖాన్ బృందం దూడ శ్రీదేవి, పి.క్రిషిక, కరుణల నృత్యప్రదర్శనలు, జి.రాధిక బృందం, కె.పెంటయ్యనాయుడుల గాత్రకచేరీ, పీవీఎస్ఎల్ సారథి బృందం వయోలిన్, టి.సత్యనారాయణ బృందం నృత్యప్రదర్శన, పి.సూర్యకుమారి, కె.స్వాతిప్రియదర్శిని బృందం నృత్యప్రదర్శన, వి.అప్పలస్వామి నృత్యప్రదర్శన, ఐ.మెహరలత గాత్రకచేరీ, డాక్టర్ పెన్నేటి స్వప్న హైందవి బృందం గాత్రకచేరీ అలరించాయి.

కళాకారులకు సత్కారం

కె.విద్యాసాగర్ బృందం, డాక్టర్ మండపాక రవి మృదంగం, బి.మంజూష బృందం, ఎ.శైలజల నృత్యప్రదర్శన, శ్రీవారి స్వచ్ఛంద సేవా సంస్థ ఎం.భీష్మారావు బృందం గాత్రకచేరీ ఆద్యంతం ఆహూతులను మంత్రముగ్ధులను చేశాయి. అనంతరం కళాకారులను నిర్వాహకులు దుశ్శాలువాలు, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో లైఫ్ మెంబర్స్ పిళ్లా విజయకుమార్, రామయ్యపంతులు, వేదిక ఇన్‌చార్జ్ అధికారులు కవిత, జానకమ్మ, నాగలక్ష్మిలు సహకారమందించారు.

ఆకట్టుకున్న విద్య, వైజ్ఞానిక ప్రదర్శన

- 166 విద్యాసంస్థల నుంచి 234 సైన్స్ ప్రాజెక్టు నమూనాలు


ఐటీఐ విద్యార్థులు రూపొందించిన సోలార్, విండ్ ప్రాజెక్టు నమూనాలు, వ్యర్థపదార్థాల కళాఖండాలు

విజయనగరం అర్బన్: విజయనగర ఉత్సవాల్లో పాఠశాల విద్యార్థులు ఆదివారం ప్రదర్శించిన విద్య వైజ్ఞానిక ప్రదర్శనలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. జిల్లా వ్యాప్తంగా 166 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, ఐటీఐ విద్యాసంస్థల విద్యార్థుల నుంచి 234 సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శనలో ఉంచారు. ఇందులో 150 పాఠశాలల నుంచి 182, 15 కళాశాలల నుంచి 32, ఒక ఐటీఐ నుంచి 20 ప్రాజెక్టుల నమూనాలను ప్రదర్శించారు. ప్రదర్శనలో ఉంచిన పలు నమూనాలు సందర్శకులను ఆలోచింపచేశాయి. ఐటీఐ విద్యార్థులు రూపొందించిన వ్యర్థ ఇనుప పదార్థాల నుంచి సృజనాత్మక పరికరాలు, సోలార్, విండ్ విద్యుత్ ఉత్పాదక నమూనాలు ఆకట్టుకున్నాయి. తాటిపూడి రిజర్వాయర్, భోగాపురం విమానాశ్రయం, దేశంలో ప్రసిద్ధి చెందిన హిందూదేవాలయాల నమూనాలు, డ్రోన్లు, క్రాఫ్ట్, ఆర్ట్ కళల చిత్రలేఖన ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రదర్శనను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎంఎల్‌సీలు డాక్టర్ గాదె శ్రీనివాసులు నాయుడు, వేపాడ చిరంజీవిరావు, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు, డీఈఓ యూ.మాణిక్యం నాయుడు పాల్గొన్నారు.

అర్ధరాత్రి లాఠీ చార్జ్

- జమ్ము గ్రామంలో ఉద్రిక్తత
- గ్రామస్తులపై విరుచుకుపడిన పోలీసులు
- పలువురికి గాయాలు


పోలీసుల లాఠీచార్జ్‌లో గాయాపడిన ఆనంద్‌ను పరామర్శిస్తున్న గుర్ల వైఎస్సార్‌సీపీ నాయకులు


గుర్ల: మండలంలో ఇంతవరకూ లేని సంస్కృతిని పోలీసులు అలవాటు చేస్తున్నారు. కూటమి నేతల ఆశీస్సులు పొందేందుకు వైఎస్సార్‌సీపీ నేతలపై కక్ష కట్టి అన్యాయంగా లాఠీ చార్జ్ చేస్తూ భయభ్రాంతులకు గురుచేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఎన్ని ప్రభుత్వాలు మారినా ప్రశాంతంగా ఉండే గ్రామం మండలంలోని జమ్ము. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక ఆ గ్రామంలో టీడీపీ నేతలు పెత్తనం చేయడానికి ప్రయత్నించారు. కానీ వీలు పడకపోవడంతో గ్రామంలో ఎదో ఒక అలజడి సృష్టించి పోలీసులను, అధికారులను రంగప్రవేశం చేయించి వారిపై తీవ్ర ఒత్తిడి చేసి వారి మాటను నెగ్గించుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. దీని పర్యావసానంగా గ్రామంలో శనివారం దేవీ విగ్రహ నిమజ్జనోత్సవం ప్రశాంతంగా జరుగుతుండగా అర్ధరాత్రి సమయంలో వైఎస్సార్‌సీపీకి చెందిన మహిళలు, పెద్దలు, యువతపై పోలీసులు ఒక్కసారిగా లాఠీ చార్జ్ చేశారు. దీంతో గ్రామంలో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ లాఠీ చార్జ్‌లో గ్రామానికి చెందిన సారంపాటి ఆనంద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మరో పది మంది మహిళలకు ఒంటిపై పోలీసుల లాఠీ దెబ్బలు తీవ్రంగా కనిపిస్తున్నాయి.


లాఠీచార్జ్‌లో గాయాలైనట్లు చూపిస్తున్న సువ్వాడ సూర్యనారాయణ

పోలీసుల తీరుకు ఖండన

జమ్ము గ్రామంలో దేవీ విగ్రహ నిమజ్జనోత్సవం జరుగుతుండగా వైఎస్సార్‌సీపీకి చెందిన వారిపై పోలీసులు లాఠీచార్జ్ చేసి విచక్షణా రహితంగా కొట్టడాన్ని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పొట్నూరు సన్యాసినాయుడు, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఆర్టీఐ వింగ్ కార్యదర్శి కెంగువ మధుసూదన రావు, నియోజక వర్గ బీసీ సెల్ అధ్యక్షుడు జమ్ము స్వామినాయుడు తీవ్రంగా ఖండించారు. ప్రశాంతమైన పల్లెలో అలర్లు సృష్టించి ఉద్రిక్త వాతావరణాన్ని నెలకొల్పుతున్న పోలీసుల తీరుపై అగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల లాఠీ చార్జ్‌లో గాయపడి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

సిరిమానోత్సవానికి రూట్‌మ్యాప్



పైడితల్లి సిరిమానోత్సవం సందర్భంగా పోలీస్ శాఖ నిర్దేశించిన కొత్త రూట్‌మ్యాప్

విజయనగరం క్రైమ్: పైడతల్లి సిరిమానోత్సవానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం వాహనాలను నిర్దేశించిన ప్రాంతాల్లో పార్కింగ్ చేయాలని ఎస్పీ దామోదర్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ పైడితల్లి జాతరకు వస్తున్న భక్తులు ఈ నెల 7న తేదీన అమ్మవారి సిరిమానోత్సవం సందర్భంగా వాహనాలపై వచ్చేవారికి పార్కింగ్ చేసేందుకు పలు ప్రదేశాలను ఏర్పాటు చేశామన్నారు. విశాఖపట్నం, కోరుకొండ, జామి, అలమండ, కొత్తవలస పరిసర ప్రాంతాల నుంచి వచ్చే వారంతా ఎత్తు బ్రిడ్జి మీదుగా మయూరి జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్, బాలాజీ జంక్షన్, ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్ వైపు వచ్చి అక్కడ ఏర్పాటు చేసిన కాశిరాజు సర్కస్ గ్రౌండ్ అయోధ్యమైదానం, ఎంఆర్ కాలేజ్ బాయ్స్ హాస్టల్లో వాహనాలను పార్కింగ్ చేయాలని సూచించారు. అలాగే ధర్మపురి, డెంకాడ పరిసర ప్రాంతాలనుంచి వచ్చే వాహనాలు ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్ మీదుగా కాశిరాజు సర్కస్ గ్రౌండ్ అయోధ్యమైదానం, ఎంఆర్ కాలేజ్ బాయ్స్ హాస్టల్ వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశాలలో వాహనాలను పార్క్ చేయాలన్నారు. ఇక నాతవలస, శ్రీకాకుళం, భోగాపురం పరిసర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు రాజీవ్ నగర్ కాలనీ జంక్షన్, దాసన్నపేట జంక్షన్ మీదుగా అయ్యకోనేరువద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలంలో గానీ లేదా రాజీవ్ నగర్ జంక్షన్, రింగ్ రోడ్డు మీదుగా ఫోర్ట్ సిటీ స్కూల్, ఎస్వీఎన్ లేఔట్‌లో ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలంలో కానీ వాహనాలను పార్కింగ్ చేయాలని సూచించారు. అలాగే నెల్లిమర్ల, చీపురుపల్లి, రాజాం, గరివిడి, గుర్ల ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు కొత్తపేట నీళ్ల ట్యాంక్ జంక్షన్ మీదగా, కొత్తపేట మంటపం పాత బస్టాండ్ మీదుగా రాజీవ్ స్పోర్ట్స్ స్టేడియం మీదుగా వచ్చి డీఎస్డీఓ ఇండోర్ స్టేడియంలో పార్కింగ్ చేయాలన్నారు. గజపతినగరం, బొబ్బిలి, సాలూరు, పార్వతీపురం, గంట్యాడ, ఎస్.కోట పరిసర ప్రాంతాల నుంచీ వచ్చే వాహనాలు కలెక్టర్ ఆఫీస్ నుంచి గూడ్స్ షెడ్, సీఎంఆర్ జంక్షన్ మీదుగా సీఎంఆర్ షాపింగ్ మాల్‌కు వ్యతిరేకంగా ఉన్న స్థలంలో పార్క్ చేయాలని సూచించారు. దీంతో పాటు పీజీ స్టార్ హాస్పిటల్ పక్కన గల ఖాళీ స్థలంలోను, ఎస్బీఐ జంక్షన్ నుంచి రామానాయుడు రోడ్డు మీదుగా ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ వద్ద గల పార్కింగ్ స్థలాల్లో పార్క్ చేయాలని తెలిపారు. ఏడవ తేదీ ఉదయం నుంచి ఎనిమిదివ తేదీ రాత్రి పదిగంటల వరకు.

ఈ దిగువన నిర్దేశించిన ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు నిషేధమని ఎస్పీ పేర్కొన్నారు.

1. బాలాజీ జంక్షన్ నుంచి సింహాచలం మేడ జంక్షన్
2. సింహాచలం మేడ జంక్షన్ నుంచి కోట
3. బాలాజీ జంక్షన్ నుంచి గంట స్తంభం
4. ఎం.ఆర్ కాలేజ్ జంక్షన్ నుంచి గురజాడ సర్కిల్
5. కన్యకాపరమేశ్వరి ఆలయం నుంచి గంటస్తంభం
6. ట్యాక్సీ స్టాండ్ నుంచి గంట స్తంభం
7. సామ్రాట్ లాడ్జి జంక్షన్ నుంచి శివాలయం మీదుగా ఎంజీ రోడ్డు 8.కమ్మవీధి జంక్షన్ నుంచి మూడు లాంతర్లు
9. గుమ్చీ జంక్షన్ నుంచి కోట జంక్షన్ వైపు అన్ని రకాల వాహనాల రాకపోకలు నిషేధించినట్లు ఎస్పీ దామోదర్ వివరించారు.

నిషేధిత స్థలాల్లో వాహనాలు పార్కింగ్ చేసిన పక్షంలో ట్రాఫిక్ పోలీసులు వాహనాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు జరిమానా కూడా విధిస్తారని ఎస్పీ దామోదర్ హెచ్చరించారు.

కొట్టక్కి ఉన్నత పాఠశాలకు పురస్కారం


కొట్టక్కి ఉన్నత పాఠశాల

రామభద్రపురం: మండలంలోని కొట్టక్కి ఉన్నత పాఠశాలకు అరుదైన పురస్కారం లభించింది.గత ప్రభుత్వంలో నాడు నేడు కింద కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నిర్మించిన అదనపు తరగతి గదులతో పాటు మరుగుదొడ్ల నిర్మాణం, అలాగే పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పరిశుభ్రత, పచ్చదనం,పర్యావరణ పరిరక్షణలో చేసిన కృషికి గుర్తింపు లభించింది. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర-2025 జిల్లాస్థాయిలో ప్రభుత్వం పాఠశాలల విభాగంలో మొదటి స్థానం దక్కించుకుంది.ఈ నెల 6వ తేదీన జిల్లా కేంద్రంలో కలెక్టర్ చేతుల మీదుగా సంబంధిత హెచ్ఎం అవార్డు అందుకోనున్నారు.

సంతోషంగాఉంది..

మా పాఠశాల స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కింద పురస్కారానికి ఎంపిక కావడం సంతోషంగా ఉంది. ఇది మా పాఠశాల సాధించిన ఘనత. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు,ఉపాధ్యాయుల సహకారం మరువలేనిది. – ఆమిటి శ్రీనివాసరావు, హెచ్ఎం ఉన్నత పాఠశాల కొట్టక్కి